క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అగస్త్యేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన చేసి అలంకరించారు. లోకకల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ సీఐగా లింగప్ప



బద్వేలు అర్బన్ : బద్వేలు అర్బన్ సీఐగా ఎస్.లింగప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని వివిధ స్టేషన్లలో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2017లో సీఐగా పదోన్నతి పొంది విజిలెన్స్, రాయచోటి, చిత్తూరు, జమ్మలమడుగు అర్బన్ స్టేషన్లలో సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు అర్బన్ సీఐగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎం.రాజగోపాల్ ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. ప్రొద్దుటూరు ట్రాఫిక్ సీఐగా సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన సీఐ రాజగోపాల్ బద్వేల్ పట్టణంలో పనిచేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరులో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రద్దీగా ఉన్న గాంధీరోడ్డు, మైదుకూరు రోడ్డులో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మైదుకూరులో బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో బార్, రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్.ధీరజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బార్ నిర్వహణ కోసం ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల పరిశీలన



పురుగు మందుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయశాఖ మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు అధికంగా ఉండే క్రమంలో యూరియా డిమాండ్ అధికంగా ఉంటుందని ఈ క్రమంలో వ్యాపారులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే క్రమంలో పంటలకు తెగుళ్ల నివారణ పేరుతో అధిక ధరలకు పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి దుకాణం వద్ద డీలర్లు ధరల పట్టికలను ప్రజలకు కన్పించేలా బహిర్గతం చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


సబ్ జైలు సిబ్బందికి చార్జిమెమో

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్ జైలులోని ముగ్గురు సిబ్బందికి జైళ్ల శాఖ ఉన్నతాధికారులు మంగళవారం చార్జి మెమో జారీ చేశారు. సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మహమ్మద్ రఫీ ఈ నెల 16న గోడ దూకి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై జైళ్ల శాఖ ఉన్నతాధికారులు విచారణ చేశారు. ఖైదీ పారిపోవడానికి విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్య మే కారణమని అధికారుల దర్యాప్తులో తేలింది. దీంతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, మరో ఇద్దరికి మంగళవారం చార్జి మెమోలు ఇచ్చారు. కాగా రెండు ప్రత్యేక బృందాలతో పారిపోయిన ఖైదీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో

ఏం జరుగుతోంది?

- కడప రేంజ్ డీఐజీ పరిధిలోని ధర్మవరం, బనగానపల్లి పెట్రోల్ బంక్‌ల్లో అవినీతి
- ధర్మవరం పెట్రోల్ బంకులో రూ.20 లక్షల అవినీతి వ్యవహారంలో నలుగురి చేతివాటం
- బనగానపల్లి పెట్రోల్ బంకులో రూ. 60 లక్షల మేర అవినీతి
- కర్నూలు డీఎస్‌డీ, బనగానపల్లి డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం



సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జైళ్ల శాఖ కడప రేంజ్ డిఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ రోజురోజుకూ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అనంతపురం జిల్లా ధర్మవరం పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరం డిప్యూటీ జైలర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయటపడినట్లు తెలిసింది. రూ.20 లక్షల పెట్రోల్ బంకు డబ్బులు, 1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతడిని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డిఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఇక బనగానపల్లి మాటేమిటో.....!

కడప రేంజ్ డిఐజీ పరిధిలో వున్న మరో పెట్రోల్ బంక్ బనగానపల్లిలో వుంది. ఈ పెట్రోల్ బంకులో రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగింది. ఈ అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం ఉన్నట్లు తెలిసింది. ఇందులో డీఎస్‌డీఓకు అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు వ్యవహారం బయటకు రాకుండా డీఎస్‌డీఓకు అనుకూలమైన ప్రస్తుత కీలక అధికారి తమ వంతు విచారణ జరగకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. ఐతే ఒక హెడ్ వార్డర్ బనగానపల్లిలోని పెట్రోల్ బంకు నిర్వహిస్తూ ఇటీవల ఆళ్లగడ్డకు బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు అవినీతి బయటపడింది. ఆళ్లగడ్డలో రిపోర్ట్ చేసుకోవాల్సిన హెడ్ వార్డర్ ఉన్నతాధికారుల ఇబ్బందులతో వాడుకున్న డబ్బులను జీపీఎఫ్ ద్వారా డబ్బులను డ్రా చేసి రూ. 10 నుంచి 12 లక్షల మేరకు చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తన పరిధిలో తాను వాడుకున్న మొత్తంలో రూ. 10 లక్షల మేరకు కట్టినట్లు సమాచారం. డీఎస్‌డీఓ పరిధిలో రూ.15 లక్షల మేర చెల్లించారు. మిగిలిన రూ. 23 లక్షలను హెడ్ వార్డర్‌ను చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకుని రావడంతో తాను విచారణకు సిద్ధమని, అందరినీ బహిరంగంగా విచారించాలని పట్టుబట్టాడు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లను పెద్దసంఖ్యలో తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మందికి పైగా దివ్యాంగుల పింఛన్‌లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందని, మానసిక దివ్యాంగులు, దివ్యాంగుల పింఛన్‌ల పైనే ఆధారపడి బతుకుతున్నారని, వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా 7821 మందికి పెన్షన్లను తొలగించారన్నారు. బద్వేలు నియోజకవర్గంలో భారీ ఎత్తున దివ్యాంగుల పింఛన్‌లను తొలగించారని బాధితులు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అర్హత కలిగిన ప్రతి ఒక్క దివ్యాంగుడికి పింఛన్ జాబితాలో ఆరు నెలలకు ఒకసారి చేరే అవకాశం ఇచ్చేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు కావస్తున్నా ఒక్క కొత్త పింఛన్‌ను ఇవ్వకుండా పాతవి తొలగించడం దుర్మార్గమని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తొలగించిన పింఛన్‌లను పునరుద్ధరించి, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన



పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, చైతన్య సంస్థ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ నరేష్ కుమార్ తెలిపారు. హెచ్‌ఐవీ నిర్మూలనా రాష్ట్రస్థాయి క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం రాణి తిరుమలదేవి కళాశాల, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూళ్లలో మందళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధుల సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు న్యాకో ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగ్గించేలా ప్రజల్లో అవగాహన కలిగించడంతోపాటు, ఎక్కువ మంది పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు వచ్చేలా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌టెన్‌సిఫైడ్ ఐఈసీ కార్యక్రమంలో రాణి తిరుమలదేవి కళాశాల కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, గీత, ప్రశాంత్‌రాజు, పుల్లయ్య, ఓలమ్మ, సునీత, ఉమామహేశ్వరి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలా బిళ్లల సేకరణ (ఫిలాటలీ) అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాల శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాళ్ స్పర్శ్ యోజన – ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ మంగళవారం తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏటా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఫిలాటలిని అభిరుచిగా కొనసాగించే 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు క్విజ్/పరీక్ష ఆధారంగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తామన్నారు. 2026లో జరిగిన చివరి పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్/గ్రేడ్ పాయింట్లు సాధించి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఐదు శాతం సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, దరఖాస్తు ఫారం స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే (ఫిలాటలీ స్టాంప్‌లు అతికించి) ది సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీస్, ప్రొద్దుటూరు డివిజన్, ప్రొద్దుటూరు– 516360 చిరునామాకు సెప్టెంబర్ 16వతేదీలోపు పంపాలన్నారు. సెప్టెంబర్ 30న ప్రొద్దుటూరు ప్రధాన తపాలా కార్యాలయంలో ఫిలాటలీ రాత పూర్వక క్విజ్ నిర్వహిస్తామని, ఎంపికైన విద్యార్థులు 15 రోజుల్లో తుది ఎంపిక కోసం ఫిలాటలీ ప్రాజెక్టు సమర్పించాలని వివరించారు. మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని తపాలా కార్యాలయంలో స్పందించాలని కోరారు.

బద్వేలును వైఎస్సార్ జిల్లాలోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న పి.రమణారెడ్డి

కలసపాడు : బద్వేలు నియోజకవర్గాన్ని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్సార్ కడప జిల్లాలోనే కొనసాగించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలసపాడులో ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ ప్రజలకు కడప జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో, వార్తా పత్రికల్లో బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లా నుండి విడదీసి రాజంపేట కేంద్రంగా ఏర్పడనున్న అన్నమయ్య జిల్లాలో కలుపుతున్నట్లు వార్తలు వస్తుండటంతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ వార్తలను ఎవరు ఖండించకపోవడంతో మరింత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రస్తుతం కడప జిల్లా కేంద్రానికి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల ప్రజలు ఇప్పుడే ఇబ్బందులు పడుతున్నారన్నారు. 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లా కేంద్రం రాజంపేటకు వెళ్లాలంటే ఎంత వ్యయప్రయాసలకు లోనవుతారో ఆలోచించాలన్నారు.

అమ్మవారిపేటలో పొలం పిలుస్తోంది



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

బి.కోడూరు : మండలంలోని అమ్మవారిపేట, అయ్యవారిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడీఏ మురళీధర్‌రెడ్డి వరిపంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. వరిలో ప్రత్యామ్నాయ పద్ధతులు, లాభాలు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ద్రవ జీవామృతం తయారీ, దాని వలన కలిగే లాభాలను తెలియపరిచారు. ఏఓ కౌశిక మాట్లాడుతూ ఖరీఫ్ 2025లో పంట సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హులైన జాబితాలో ఏవైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్ నమోదు చేయించుకోవడానికి ఈ నెల 20 చివరి తేదీ అని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ తహసీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు



కేబుల్ వైర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన డిష్, ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యంగా ఉందని, వైర్లను సరిచేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు.చాలా ప్రాంతాల్లో కేబుల్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో డిష్, ఇంటర్నెట్ కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాల నుంచి కిందకు జారి ప్రజలకు అసౌకర్యంగా ఉన్నా సంబంధిత యాజమాన్యం పట్టించుకోవడం లేదని అన్నారు. ఏవైనా ప్రమాదాలు జరగకముందే సంబంధిత యాజమాన్యం స్పందించి వారం రోజుల్లో కేబుల్ వైర్లను సరి చేసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపాలిటీ సిబ్బందితో తొలగింపజేస్తామని తెలిపారు. అలాగే వినియోగదారులు తమ ఇళ్ల వద్ద కిందకు వేలాడే కేబుల్ వైర్లను సంబంధిత యాజమాన్యానికి తెలిపి సరి చేసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. జిన్నా రోడ్డు మోటు వద్ద చెత్త పాయింట్‌ను కార్మికులతో తొలగింపజేశారు. వైఎంఆర్ కాలనీలో పందుల పట్టు కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. మోడంపల్లెలోని జీవనజ్యోతి హైస్కూల్ వద్ద నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

రాజోలి ఆనకట్ట వరద నీరు

రాజుపాళెం : కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. మంగళవారం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 25,382 క్యూసెక్కులు నీరు, కేసీ ప్రధాన కాలువకు 200, కేసీ చాపాడు కాలువకు 50 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట వద్ద జళకళగా సంతరించుకుంది. అలాగే వెల్లాల పాత వంతెనపై తాకుతూ వరద నీరు పోతోంది. కుందూనది పరిధిలోని గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



రాజుపాళెం: రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి వరద నీరు

వైభవంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం



శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



కోలాటం ఆడుతున్న మహిళలు

పోరుమామిళ్ల : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని తిరువెంగళాపురంలోని రామాలయం వద్ద శ్రీకృష్ణుని ప్రతిమను కృష్ణాష్టమి సందర్భంగా కొలువుదీర్చి 4 రోజులు పాటు పూజలు చేసి మంగళవారం ప్రతిమను గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవంలో వేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో బాలయ్య, జి.అబ్బిరెడ్డి, పి.అబ్బిరెడ్డి, పి.పుల్లారెడ్డి, రఘురాంరెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి, కె.పిచ్చయ్య, కె.బాలుడు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన రాచమల్లు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడి కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి కలిసి మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలపై ఆయన జగన్‌తో చర్చించారు. ఆయన వెంటనే వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఉన్నారు.

సాగునీటి పైపులైను ఏర్పాటుచేయించండి

డీటీ కృష్ణారెడ్డికి సోమాపురం బాధిత రైతుల వినతి



సాగునీటి కోసం పైపులైను ఏర్పాటు చేయించాలని డీటీని కోరుతున్న రైతులు

చాపాడు : గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణంలో పొలం పోగొట్టుకున్నామని, ఇందులో పంట కాలువలు కూడా ఉన్నాయని.. మిగిలిన పొలంలో పంటలు సాగు చేసుకునేందుకు సాగునీటికి ఇబ్బందులు ఉన్నాయి. తమ పొలానికి నీరు వచ్చేలా సాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయించాలని మంగళవారం డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డిని సోమాపురం గ్రామానికి చెందిన పలువురు బాధిత రైతులు కలిసి విన్నవించారు. బాధిత రైతులు డీటీతో మాట్లాడుతూ.. సర్వే నెంబరు 28–4బి2లో 22 సెంట్లు వ్యవసాయ భూమి ఉండగా ఇందులో 18 సెంట్లు రోడ్డు నిర్మాణంలో పోయిందన్నారు. మిగిలిన 4 సెంట్ల భూమి వద్ద నుంచి తమ పంట పొలాలకు సాగునీరు వచ్చే పంట కాలువలు ఉన్నాయన్నారు. ఈ కాలువల ద్వారా రోడ్డుకు అవతలి వైపున 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈ భూమికి సాగు నీరు అందాలంటే రోడ్డు క్రింద పైపులైన్ వేయాలన్నారు. ఇప్పటికే పైపులైను నిర్మాణం జరిగిందని, నీరు అందిందించేందుకు మరో పైపును అమర్చాలన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రోడ్డు నిర్మాణ కంపెనీ అధికారులను తప్పుదోవ పట్టించి తమ పొలాలకు సాగునీటిని అందించేందుకు పైపులైన్ పూర్తవకుండా అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు స్పందించి తాము వ్యవసాయం చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సాగునీటి పైపులైను ఏర్పాటు చేయించాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు నేటితో ముగియనున్న గడువు



మాట్లాడుతున్న ఏఓ బాలగంగాధర్ రెడ్డి

మైదుకూరు : అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగియనుందని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె, రాయప్పగారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో సాగు చేసిన ఉల్లి, పసుపు పంటలలో ప్రస్తుతం ఉన్న వాతావరణం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎవరైనా కొత్తగా భూమిని ఆన్‌లైన్ చేయించుకుని ఉంటే వారు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. సమీప రైతు సేవా కేంద్రం లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పంట నమోదు, పంటల బీమా ఆవశ్యకతల గురించి రైతులకు వివరించారు. ఉల్లి, పసుపు, వరి, జొన్న, మినుము పంటలు సాగు చేసిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా తరపున ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి ఈనెల 15 వరకు ఉన్న గడువును ఈనెలాఖరు వరకు పొడిగించారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వినయ్ బాబు, సమీర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బద్వేలు అర్బన్ : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దూరం చేయవచ్చని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. మడకలవారిపల్లె సమీపంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ స్నానం చేయడంతో పాటు ఉతికిన బట్టలను ధరించాలని, చేతివేలి గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, ఆశ కార్యకర్తలు రామకుమారి, నారాయణమ్మ, సుజాత, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సార్..బస్ షెల్టర్ ఏర్పాటు ఎప్పుడు?

- రూ. 5లక్షుల నిధులు మంజూరు అన్నారు
- ఏడాదిగా మాటలు మాత్రమే

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో భక్తులకు బస్ షెల్టర్ లేక అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస్సు కోసం వేచి ఉండాలంటే సమీపంలోని వ్యాపార సముదాయాల దగ్గర నిలుచోని ఉండాలి. మండల ప్రజలు, భక్తులకు బస్ షెల్టర్‌లేకపోవడంతో ఎండలు, వానలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజలు పలు దఫాలుగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం రూ. 5లక్షల నిధులతో తాత్కలికంగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి ఏడాది కావస్తోంది. ఇంతవరకు అస్సలు బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థలం కేటాయించలేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన చోట నిర్మిస్తారా లేక మరొకచోట ఏర్పాటు చేస్తారా అని ప్రజలు, భక్తులు ఎదురు చూస్తున్నారు. బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేయడమే ముఖ్య ఉద్దేశం అంటూ ఎమ్మెల్యే చెప్పడం తప్పా ఎక్కడా కార్యరూపం దాల్చలేదని స్థానికులు తెలుపుతున్నారు. బుధవారం బి.మఠంకు ఎమ్మెల్యే పుట్టా వస్తున్న సందర్భంగా కనీసం బస్‌షెల్టర్‌కు స్థలం ఎంపిక చేయాలని భక్తులు కోరుతున్నారు.

అనధికార లే అవుట్లను రెగ్యులరైజేషన్ చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న శైలజ

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరులో నెలకొన్న అనధికార లే అవుట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కడప పట్టణాభివృద్ధి సంస్థ ప్లానింగ్ అధికారి శైలజ పేర్కొన్నారు. మండలంలోని హౌసింగ్‌బోర్డు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఎల్‌టీపీలకు అనధికారిక లే అవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికారిక లే అవుట్లు, ప్లాట్లను గత నెల 26 నుంచి నుంచి 90 రోజుల్లోగా దరఖాస్తు చేసుకుని రెగ్యులరైజ్ చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ నంబర్ 134 ప్రకారం 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చన్నారు. రెగ్యులరైజేషన్ కోసం ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాట్ల యజమానులే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్లాట్ సైజ్, భూమి ప్రభుత్వ విలువ ఆధారంగా చార్జీలు ఉంటాయన్నారు. లే అవుట్‌లో ఓపెన్ స్పేస్ లేనప్పుడు 50 శాతం రాయితీతో భూమి విలువపై 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలు ప్లాట్ల, లే అవుట్ల యజమానులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.